## క్లుప్తంగా

### తెలంగాణ మద్యం అమ్మితే చర్యలు



పిడుగురాళ్ల: బార్ అండ్ రెస్టారెంట్‌లలో తెలంగాణ మద్యాన్ని కానీ, ప్రభుత్వ దుకాణాలలోని మద్యం సీసాలను కానీ అమ్మకాలు చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని నర్సరావుపేట ప్రొహిబిషన్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ కాలేషావలి అన్నారు. పల్నాడు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ వి.శ్రీనివాసులు ఆదేశాలనుసారం పిడుగురాళ్ల పట్టణంలోని బార్ అండ్ రెస్టారెంట్లల్లో గురువారం తనిఖీలు నిర్వహించటం జరిగిందని కాలేషావలి తెలిపారు. పట్టణంలోని ఆరు బార్ అండ్ రెస్టారెంట్లను పరిశీలించి మద్యం సీసాల నిల్వలను తనిఖీ చేయటం జరిగిందన్నారు. తెలంగాణ మద్యం కానీ, ప్రభుత్వం దుకాణాలకు సంబంధించి మద్యం సీసాలు కానీ అమ్మకాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఆయన వెంట ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి కావడి ఉత్సవం



పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులో వేంచేసియున్న నాగులు గుడి దేవాలయంలో గురువారం ఆడి కృత్తిక మహోత్సవం సందర్భంగా సంతాన సుబ్రహ్మణ్యస్వామి కావడి ఉత్సవం, పల్లకి ఉత్సవం, గ్రామోత్సవాలతోపాటు విశేష ద్రవ్యాలతో అభిషేక కార్యక్రమాలను నిర్వహించటం జరిగింది. అనంతరం భక్తుల దర్శనార్థం స్వామికి సాయంత్రం వేళలో దేవాలయం నుంచి పట్టణ పురవీధుల్లో పల్లకీ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ పూజారి వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళలు విశేషంగా హాజరై కావడి ఉత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

### ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్టు



పిడుగురాళ్ల: పట్టణంలోని పలు ప్రాంతాలలో ద్విచక్ర వాహనాలను దొంగలించిన వారిని అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు గురువారం వివరాల సమావేశం తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐ ఆంజనేయులు మాట్లాడుతూ పట్టణానికి చెందిన షేక్ మహ్మద్ రఫీ, షేక్ సైదాల వ్యక్తుల నుంచి 13 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు. వీటి విలువ సుమారు రూ. 8 లక్షల నుంచి రూ. 12 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. పిడుగురాళ్ల పట్టణ పరిసర ప్రాంతాలలో వీళ్లు ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. పిడుగురాళ్ల పట్టణ పోలీసులు చాకచక్యంగా నిఘా వేసి పట్టుకోవటం జరిగిందన్నారు. పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రెంటచింతల: స్థానిక శారదా నగర్ సమీపంలోని గోలి వాగు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి మృతిచెందిన సంఘన చోటుచేసుకుంది. ప్రకాశం జిల్లా యర్రగుండపాలెంకు చెందిన జి.గోవింద్‌నాయక్ (35) ఏడాది కాలం నుంచి స్థానిక ఏడుమంగళంవాగు సమీపంలోని రేగుల మాన్యం కాలనీలో ఉంటున్నాడు. గురువారం ఉదయం పాలువాయి జంక్షన్‌నుంచి రెంటచింతలకు ద్విచక్ర వాహనంపై వస్తూ గోలివాగు వంతెనపై ఉన్న బోర్డును వేగంగా ఢీకొట్టాడు. కింద పడిన గోవింద్‌నాయక్‌ను అక్కడ ఉన్న వారు పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. వెంటనే మృతుడు తల్లి రాణి, వారి బంధువులు గోవింద్‌నాయక్ మృతదేహాన్ని వారి స్వగ్రామానికి తీసుకువెళ్లారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

### అమ్మవారికి రూ.7.97 లక్షల ఆదాయం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం గ్రామంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి దేవస్థానానికి హుండీల ద్వారా రూ. 7,97,033ల ఆదాయం లభించింది. ఆలయ హుండీల లెక్కింపును గురువారం నిర్వహించారు. దేవాలయ హుండీల ద్వారా రూ.7,37,207లు, అన్నదాన హుండీ ద్వారా రూ.59,826లు ఆదాయంగా లభించింది. 75 రోజులకు ఈ ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ టి. సుధాకరరెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపు పర్యవేక్షకులుగా దేవదాయ ధర్మదాయ శాఖ ఈఓలు ఆర్.వెంకటేశ్వరరావు, బండి శ్రీనివాసరావులు వ్యవహరించారు.

# పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- నియోజకవర్గంలో 150వ రోజుకు చేరుకున్న గడప గడపకు మన ప్రభుత్వం



పోతురాజు గుట్టలో మహిళకు సంక్షేమ కరపత్రం అందిస్తున్న ప్రభుత్వ విప్ రామకృష్ణారెడ్డి

కారెంపూడి: మాచర్ల నియోజక వర్గంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 150 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా పార్టీ కేడర్ ఆనందోత్సాహాల మధ్య సంబరాలు చేసుకున్నారు. కారెంపూడి మండలం పేటసన్నెగండ్ల గ్రామ శివారు బాలచంద్రానగర్ (పోతురాజు గుట్ట)లో గురువారం సాయంత్రం పీఆర్కే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు విచ్చేశారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు 150 రోజులు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే పీఆర్కే చేతుల మీదగా కేక్ కట్ చేయించి, సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పీఆర్కేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పీఆర్కే మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ముమ్మాటికి పేదల అభ్యున్నతికి కట్టుబడి పని చేస్తోందన్నారు. పేదల ఆర్థిక అభివృద్ధి, వారి పిల్లల విద్యాభివృద్ధి, వారి ఆరోగ్య సంరక్షణ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషిని, చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు ఇలాగే కొనసాగడానికి జగనన్న ప్రభుత్వానికి అండగా నిలవాలని ఎమ్మెల్యే పీఆర్కే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుడగ జంగాల కాలనీలో 120 గడపలకు ఎమ్మెల్యే వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆ తర్వాత మిగతా పోతురాజుగుట్ట ప్రాంతంలో రాత్రి వరకు పర్యటించారు. ప్రతి గడపకు ఉత్సాహంగా వెళ్లి ఆ గడపలకు చేకూర్చిన లబ్ధిని వివరించారు. అమ్మఒడి పథకం ద్వారా డబ్బులు రావడం వల్ల పిల్లలను చదివించుకో గలుగుతున్నామని మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. చాలా కాలంగా చదువుకు దూరంగా ఉన్న తమ పిల్లలు ఈ రోజు అమ్మ ఒడి పథకం వల్ల చదువుకోగలుగుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. మాకు మా పెద్దలకు చదువు లేదని ఇప్పుడు ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమంది చదువుకుంటున్నారని తెలిపారు. ఎంతోకాలంగా సంచార జాతులుగా ఉన్న తమ అభివృద్ధికి ఎమ్మెల్యే పీఆర్కే అందిస్తున్న సహాయసహకారాలకు జంగాలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి గడపలో పీఆర్కేకు సాదర స్వాగతం పలికారు. శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. గ్రామ సర్పంచ్ జవ్వాజీ నాగేంద్రం, ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ ఆరిఫ్, పార్టీ మండల అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, ఎంపీటీసీలు కొంగర ఇందిరాదేవి సుబ్రమణ్యం, గాడిపర్తి రమాదేవి పూర్ణయ్య, మాజీ సర్పంచ్‌లు ఉన్నం ఆదిశేషగిరిరావు, నర్సింగ నాగేశ్వరరావు, పోతురాజు గుట్ట ప్రాంత నాయకులు పెల్లూరి పెదలింగయ్య, పెల్లూరి కోటయ్య, పెల్లూరి బిక్షం, పల్లపాటి శ్యాంసన్, గ్రామ పార్టీ నాయకులు మాచర్ల ఏడుకొండలు, జవ్వాజి బాలరాజు, తోడేటి సుబ్బారావు, చిన్ని, వెన్నపూసల బుల్లెబ్బాయి, మామిడి శేఖర్, మామిడి అన్నారావు, బత్తుల కోటేశ్వరరావు, నాదెండ్ల నాగేశ్వరరావు, మీరాహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



150 రోజులు అయిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

# ప్రజల ఆకాంక్షలు నెరవేర్చిన ప్రభుత్వం

**గడప గడపకు మన ప్రభుత్వంలో గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి**

పిడుగురాళ్లరూరల్: రాష్ట్రంలోని ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని అంజనీపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలను అందించి, వారి ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటున్నామన్నారు. గడిచిన నాలుగేళ్లల్లో నవరత్నాల ద్వారా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించామని, దానితోపాటు మరిఏమైనా సమస్యలు ఉన్నాయాని తెలుసుకునేందుకే మీ ఇళ్ల వద్దకు వస్తున్నామన్నారు. ఓటు అడిగేందుకు కాదని ఆయన అన్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలను చూశారని, నాగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.లక్షల్లో లబ్ధి చేకూరడం చూశారా? అని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు ఎలా వస్తున్నాయో ఆలోచించాలని, ఇంతటి మేలు చేసిన ముఖ్యమంత్రిని గతంలో ఎప్పుడూ చూడలేదన్నారు. ఈ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలోమండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, ఎంపీపీ అల్లు సత్యవతి, పిచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ బైరపోగు కుమారి ఏలయ్య, ఎంపీటీసీ షేక్ హస్సాన్‌వలి, గున్నంరెడ్డి పెద్ద రమణారెడ్డి, మాజీ సర్పంచ్ ముత్యం ఉమామహేశ్వరరెడ్డి, సీనియర్ నాయకులు కత్తెరపు రంగారెడ్డి, ఉప సర్పంచ్ రాగిడి రాజారావు, మాజీ సొసైటీ అధ్యక్షులు రామిరెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



అంజనీపురంలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

# ఆర్‌డీటీ ఆధ్వర్యంలో 38 ఇళ్ల నిర్మాణం

వెల్దుర్తి: శ్రీశైలం రీజియన్‌లోని యర్రగొండపాలెం ఏరియాలోని వెల్దుర్తి మండలం బొటుకుల పాయ గ్రామంలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్‌డీటీ) సంస్థ వారు రూ.1.30 కోట్లతో 38 ఇళ్లు నిర్మించి చెంచు గిరిజన లబ్ధిదారులకు అందించటం హర్షణీయమని మాచర్ల జెడ్పీటీసీ సభ్యుడు మండ్లి పెద మల్లుస్వామి, ఆర్‌డీటీ సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ మంచు ఫెర్రర్ అన్నారు. గురువారం మండలంలోని బొటుకులపాయలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా నూతన గృహాలు నిర్మించటం, ప్రవేశాలు చేయటం సంతోషకరమన్నారు. ఆర్‌డీటీ ద్వారా గిరిజనుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. వెల్దుర్తి, దుర్గి, మాచర్ల మండలాలలోని 11 చెంచు గూడెంలను కొత్తగా ఆర్‌డీటీ సంస్థలోకి తీసుకోవటం శుభపరిణామమన్నారు. ఆర్‌డీటీ సంస్థ వారు అందిస్తున్న సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌డీటీ రీజనల్ డైరెక్టర్ పుష్పలత, ఏరియా టీం లీడర్ గిరిజ, సీఓ ఎస్.సయ్యద్‌బాషా, పై మూడు మండలాలకు చెందిన చెంచు గూడెంలకు చెందిన 300 మంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండ్లి పెద మల్లుస్వామి, ఆర్‌డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మంచు ఫెర్రర్

### వేలంద్వారా అమ్మవారికి రూ.10లక్షల ఆదాయం

దుర్గి: వేలం ద్వారా నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయానికి రూ.10లక్షల ఆదాయం దక్కింది. ఆలయ పరిసర ప్రాంతాలలో సంవత్సరం పాటు ఐస్‌క్రీమ్‌లు, ఐస్ అమ్మకాలు నిర్వహించుకునే లైసెన్స్‌ను రూ. 10,07,000లకు కోట రామారావు అనే కాంట్రాక్టర్ దక్కించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీగిరిరాజు నరసింహబాబు తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో ఐస్‌క్రీమ్ అమ్మకాల వేలం నిర్వహించారు. నూతనంగా టెండర్ దక్కించుకున్నవారికి ఈ నెల 15న ప్రారంభమై, వచ్చే సంవత్సరం జూలై 14న కాల వ్యవధిలో వ్యాపారం నిర్వహించుకునే హక్కు ఉంటుందని అధికారులు తెలిపారు. గత సంవత్సరం ఇదే వేలం రూ. 6,94,000లకు పరిమితమైంది. రూ. 3లక్షలకు పైగా టెండర్ పెరగడం విశేషం.

# ట్రిపుల్ ఐటీకి ముగ్గురు విద్యార్థులు ఎంపిక

మాచవరం: 2023–24 విద్యా సంవత్సరానికి గానూ మండల కేంద్రమైన మాచవరం జెడ్పీ హైస్కూల్‌నకు చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం కె.ఎస్.ఎస్ సురేష్‌బాబు తెలిపారు. పాఠశాలకు చెందిన షేక్ జాస్మిన్ (నూజివీడు), గొల్లపల్లి జయశ్రీ (శ్రీకాకుళం), ఏకుల చైతన్యకుమార్ (ఇడుపులపాయ) క్యాంపస్‌లలో సీట్లు సాధించినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు పాఠశాల కమిటీ చైర్మన్ నీలం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు అభినందించారు.

**కారెంపూడి విద్యార్థికి సీటు..**

కారెంపూడి: స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి దాసరి అక్షయ్ ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడని పాఠశాల హెచ్‌ఎం గొల్లపల్లి అనంతశివ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్షయ్ పదవ తరగతిలో 562 మార్కులు సాధించాడు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నందుకు ఇచ్చే బోనస్ మార్కులు 24తో కలిపి అక్షయ్ 586 మార్కులతో బీసీ డి రిజర్వేషన్‌లో సీటు సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అక్షయ్‌కు అభినందనలు తెలిపారు.

# కొనసాగిన ఆగ్రహ జ్వాలలు



అడిగొప్పలలో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న వలంటీర్లు

- అడిగొప్పలలో వలంటీర్ల రాస్తారోకో
- పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ ఊరేగింపు, దహనం

దుర్గి: గత రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్ల ఆగ్రహజ్వాలలు ఇంకా చల్లారలేదు. గురువారం పల్నాడు జిల్లా దుర్గి మండల పరిధిలోని అడిగొప్పల, కంచరగుంట గ్రామాలలో వలంటీర్లు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అడిగొప్పల గ్రామ వలంటీర్లు పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను ఊరేగించి నర్సరావుపేట వెళ్లే ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. ఈ కార్యక్రమంలో వాలి సైదారావు, సాహిదా, మల్లేశ్వరి, శ్రీనివాస్‌రెడ్డి, తాళ్ళ సుజాత, పి.అన్నారావు, ఎస్‌కె సలీం బాషా, పలువురు పాల్గొన్నారు.



కంచరగుంటలో పవన్ కల్యాణ్ దిష్టి బొమ్మను దహనం చేసిన వలంటీర్లు

**కంచరగుంటలో..**

గ్రామానికి చెందిన వలంటీర్లు దుర్గికి వెళ్లే ప్రధాన రోడ్డు పై నిరసన వ్యక్తం చేసి, పవన్ కల్యాణ్ చిత్రపటాలను దహనం చేశారు. పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలని నినాదాలు చేశారు. మూడావత్ హరిలాల్ నాయక్, కోటా రాజేష్, మూడావత్ రోజా, అరిగెల సంధ్య, అర్చన, గిరిజ, చిట్టి పలువురు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే జగనన్న సురక్ష లక్ష్యం



పిన్నెల్లిలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమం సభ



నడికుడి సచివాలయంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

మాచవరం: ప్రజా సమస్యలను పరిష్కరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, జెడ్పీటీసీ జె.శివాయాదవ్ అన్నారు. మండలంలోని పిన్నెల్లి-1, మోర్జంపాడు-2 గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష గ్రామ సభలు గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ అర్హులైన వారిని గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో వలంటీర్లు ఇంటింటి సర్వే చేపట్టి గుర్తించిన పలు సమస్యలను పరిష్కరించారు. పలు అంశాలకు సంబంధించిన దరఖాస్తులకు పరిశీలించి, వాటికి ధ్రువీకరణ పత్రాలు అందించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, మండల ప్రత్యేక అధికారి శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీడీఓ వరప్రసాద్, తహసీల్దార్ ప్రసాద్, ఈఓఆర్‌డీ వెంగళరావు, డీటీ సుబ్బారావు, వైస్ ఎంపీపీ చింతపల్లి నన్నే, ఎంపీటీసీలు జానీబేగం షైదా, ముంగి మంగమ్మ శివరామయ్య, సిపోరా మోషే తదితరులు పాల్గొన్నారు.

**కొత్తూరులో...**

విజయపురిసౌత్: జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హులందరికి సంక్షేమ పథకాలు, ధ్రువీకరణ సత్వరమే అందుతున్నాయని మాచర్ల ఎంపీడీఓ కోటేశ్వరావు అన్నారు. గురువారం మాచర్ల మండలంలోని కొత్తూరు గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాచర్ల డీటీ వాణి, ఎంఈఓ వేముల నాగయ్య, పంచాయతీరాజ్ ఏఈ సురేంద్ర, గ్రామ సర్పంచ్ మద్దిగపు అచ్చిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబునాయక్, మండల హార్టికల్చర్ అధికారి సురేష్, శిశు సంక్షేమ అధికారిణి లీలావతి, ఎంపీటీసీ మంగ్యాబాయి, పంచాయితీ కార్యదర్శి షర్మిల పాల్గొన్నారు.

**నడికుడిలో...**

దాచేపల్లి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ సాంబయ్య అన్నారు. నడికుడి-1 సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంను గురువారం చేపట్టారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ వి.సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, మండపాటి రమేష్ రెడ్డి, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌బాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, కో-ఆప్షన్ సభ్యుడు వేల్పుల ధర్మదేవ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.



కండ్లకుంటలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ చింతా శివరామయ్య, ఎంపీడీఓ ప్రసాద్

**కండ్లకుంట, శిరిగిరిపాడులలో...**

వెల్దుర్తి: జగనన్న సురక్ష పథకం పాలనలో విప్లవాత్మకమైన మార్పునకు నాంది పలికిందని మండల పరిషత్ అధ్యక్షుడు చింతా శివరామయ్య, ఎంపీడీఓ ప్రసాద్‌లు అన్నారు. గురువారం మండలంలోని కండ్లకుంట, శిరిగిరిపాడు 1 గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శిరిగిరిపాడు 1లో 131 ధ్రువీకరణ పత్రాలు అందజేశామన్నారు. కండ్లకుంటలో 21 ధ్రువీకరణ పత్రాలు అందించారు. జెడ్పీటీసీ సభ్యుడు రూప్లీబాలు నాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

**పిడుగురాళ్లలో...**

పిడుగురాళ్ల: ప్రజల సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు తెలిపారు. పట్టణంలోని సత్యసాయిబాబా కల్యాణ మండపం, చెరువు కట్ట బజారు పంపు హౌస్ వద్ద జగనన్న సురక్ష క్యాంపులను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తుందన్నారు. అదేవిధంగా చెరువు కట్ట పంప్ హౌస్ వద్ద 14 సచివాలయం, సత్యసాయి బాబా కల్యాణ మండపం నందు 6, 9, 10 సచివాలయల పరిధిలోని ప్రజలకు జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించటం జరిగింది. ఇందులో పలు రకాల సేవల కోసం 432 అర్జీలను పరిష్కరించి సర్టిఫికెట్లను అందించటం జరిగిందని మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీటీ ధనలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కొమ్ముముక్కంటి, షేక్ జైలాబ్దిన్, మున్సిపల్ కౌన్సిలర్లు కత్తెరపు వాసుదేవరెడ్డి, అజ్మీర దేవిక, మాదాల కిరణ్‌కుమార్, షేక్ అబ్దుల్లా, ముక్కంటి, పసుపులేటి ఆనంద్, గుర్రం అప్పిరెడ్డి, జోగిపర్తి సుజాత ముక్కంటి, నాయకులు పాల్గొన్నారు.

**జూలకల్లులో...**

పిడుగురాళ్లరూరల్: జగనన్న సురక్షతో అపరిష్కృత సమస్యలకు పరిష్కారం లభిస్తుందని వైఎస్ ఎంపీపీ గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని జూలకల్లు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్ ఎంపీపీ గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సర్టిఫికెట్‌లను ప్రజలకు ఉచితంగా అందించటం జరుగుతుందన్నారు. ఎంపీడీఓ కాశయ్య, డీటీ ధనలక్ష్మి, ఈవోపీఆర్‌డీ శంకర్‌రావు, సర్పంచ్ ఇనుముక్కల పాపులమ్మ రాజా కిషోర్, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

**తాళ్ళపల్లిలో...**

మాచర్ల రూరల్: అర్హత కలిగిన అందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం తీసుకొచ్చిందని తహసీల్దార్ మహమ్మద్ హుస్సేన్ అన్నారు. గురువారం మండలంలోని తాళ్లపల్లి గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్ఐ ఫణీంద్ర, సర్పంచ్‌లు తీర్థాల ఈశ్వరయ్య, మాజీ సర్పంచ్ ఊటుకూరు వెంకట్రామయ్య, ఉప సర్పంచ్ పసుపులేటి బ్రహ్మానాయుడు, శ్రీనునాయక్, ఆరుముళ్ళ నాగేశ్వరరావు, కార్యదర్శి ఆవుల వెంకట్రామయ్య పాల్గొన్నారు.

# విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు పంపిణీ

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద విభిన్న ప్రతిభావంతులకు సహాయక పరికరాలను ఉచిత పంపిణీలో భాగంగా గుర్తింపు శిబిరం గురువారం నిర్వహించారు. దివ్యాంగులకు ఉపయోగపడే ఉపకరణాలు ఉచితంగా అందజేసేందుకే ఈ శిబిరం నిర్వహించినట్లు డిజేబుల్డ్ సూపర్‌వైజర్ డి. శివలక్ష్మీ కలెక్టర్ ఉత్తర్వుల మేరకు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ, సమాజాక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వంకు సంబంధించి అలెన్‌కో ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాలు అందజేయడంలో భాగంగా ఈ గుర్తింపు శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. గుర్తింపు శిబిరంలో ఉపకరణాలు కావల్సిన విభిన్న ప్రతిభావంతుల పేర్లు నమోదు చేసుకొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 125 మందికి అవసరమైన వివిధ రకాల ఉపకరణాలు నమోదు చేసుకున్నామని, వీటిని త్వరలో అందజేస్తామన్నారు.



మాట్లాడుతున్న శివలక్ష్మి

# ప్రమాదాలు జరగకుండా చూడండి



సూచనలు చేస్తున్న డీఎస్పీ మహేష్

నరసరావుపేట: స్కూలు, కళాశాలలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులను ఇంటి నుంచి స్కూల్‌కి, స్కూల్ నుంచి ఇంటికి తీసుకు వెళ్లే క్రమంలో బస్సులకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా యాజమాన్యాలు, డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ కేవీ మహేష్ కోరారు.

గురువారం డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు నరసరావుపేటలో పట్టణ, రూరల్ పరిధిలో స్కూళ్ల యజమానులు, బస్ డ్రైవర్లతో తీసుకోవా ల్సిన జాగ్రత్తలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, పాటించ వలసిన పద్ధతులపై పలు సూచనలు చేశారు. బస్సులు యాక్సిడెంట్ జరగకుండా చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. ఇదే విధంగా వినుకొండ, చిలకలూరిపేట స్కూల్ యాజమాన్యం, బస్ డ్రైవర్లతో సమావేశం నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

### రేపు శనిత్రయోదశి ప్రత్యేక పూజలు



మాచర్ల రూరల్: శని త్రయోదశిని పురస్కరించుకొని ఈ నెల 15వ తేదీన ప్రసిద్ధి చెందిన వీరభద్ర స్వామి దేవాలయంలోని శని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకుడు భరణి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శని త్రయోదశిలో భక్తులు అర్ధాష్టమశని, అష్టమ శని, ఏలిన నాటి శని వంటి వాటిపై ప్రత్యేక పూజలకు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పూజలు చేయదలచినవారు శనివారం తెల్లవారుఝామున దేవాలయానికి చేరుకోవాలని కోరారు. పూజా సామగ్రిని దేవాలయంలోనే అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ సాంబయ్య, ఆలయ పూజారులు పాల్గొన్నారు.